telugucalendars.in



# మీన రాశి ఫలితములు

**పూర్వాభాద్ర 4 వ పాదము (ది)**
**ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు (దు, శ్య, ఝా, థా)**
**రేవతి 1,2,3,4 పాదములు (దే, దొ, చా, చి)**

**ఆదాయం-8 వ్యయం-11 రాజయోగం-1 అవమానం-2**

మీనరాశి వారికి ఈ సం॥ **గురువు** ఏప్రిల్ 21 వరకు మీనం(జన్మం) లోను తదుపరి సం॥ చివరి దాకా మేషం (ద్వితీయం) లోను సంచరిస్తు శుభఫలితాలు. **శని** సం॥ అంతా కుంభం(వ్యయం) లో సంచరిస్తు వ్యతిరేక ఫలితాలు. అక్టోబర్ 30 వరకు **రాహువు** మేషం (ద్వితీయం)లో తదుపరి సం॥ చివరిదాకా మీనం (జన్మం) లో సంచరిసూ వ్యతిరేకఫలితాలు. అక్టోబర్ 30 వరకు **కేతువు** తుల(అష్టమం) లోను తదుపరి సం॥ ఆఖరుదాకా కన్య(సప్తమం)లో సంచరిస్తు వ్యతిరేకఫలాలు. అక్టోబర్ 3 నుండి నవంబర్ 16 దాకా **అష్టమ కుజుడు.**

ఈ సం॥ గోచారం పరిశీలింపగా ఈ రాశి స్త్రీ/పురుషులకు 2వఇంట గురుసంచారం బాగా యోగించి కుటుంబ, ఆర్థిక, సంతామ, స్థిరాస్తి, విద్యా విషయాలు బాగుగా ఉండును. కానీ శని 12వఇంట వ్యయ సంచారం బహు దుఃఖప్రదం. జన్మ సప్తమాల్లో రాహు కేతువులు కూడా అనేక సమస్యలు సృష్టిస్తూఉంటారు. ఏలినాటిశని ప్రారంభంకావున, ఉద్యోగం అంటే చిరాకు, ఏదీ నచ్చకపోవటం జరుగుతుంది. వివాహ ప్రయత్నాలు ఎంతవేగంగా చేస్తే అంతమేలు. ఆలస్యంచేస్తే మంచి సంబంధాలు దొరకటం కష్టమవుతుంది. డబ్బులు తీయందే ఏపనీజరగదు, కోర్టు సమస్యలకు భారీగా ఖర్చుచేస్తారు కానీ ప్రయోజనం శూన్యం. పెద్దల ఆశీస్సులతో ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. విదేశీ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

ఉద్యోగులకు సువర్ణావకాశాలు లభిస్తాయి. కొందరు సొంత పరిశ్రమలు కూడా మొదలు పెడతారు. బదిలీలు అనుకూలంగా ఉంటాయి. వ్యాపారస్థులు చిత్రవిచిత్ర పరిస్థితులు ఉంటాయి, ఎపట్టికప్పుడు మారిపోతూ అనేక వింత అనుభవాలు ఎదురవుతాయి. పనిలో చురుకుదనం తగ్గుతుంది. వ్యర్థ రాకపోకలు పెరుగుతాయి. గురుఅనుగ్రహం వలన అధికలాభాలుఉంటాయి. కానీ రాహుకేతువులవల్ల ప్రశాంతత లోపిస్తుంది. కొత్తవ్యాపారస్థులు దూరదృష్టితో ప్రణాలికలు లేకపోతే ఇబ్బదిపడతారు. రాజకీయవేత్తలు ఉన్నతపదవులు చేపడతారు. జనాకర్షణ ఉంటుంది. వాటినిమిత్తం ఊహించనివిధంగా ఖర్చు చేస్తారు. ఋణాలు పెరుగుతాయి. కార్యకర్తలు మటుకు సహకరించరు, మీనుంచీ ఎక్కువగా ఆశిస్తారు. మీధాటికి ప్రత్యర్థులు హడలిపోవుదురు. అన్నిపనులు సొంతంగాచేసుకుంటారు. దైవబలం సరైనసమయానికి అవకాశాలు కల్పిస్తుంది.

విద్యార్థులు గురుబలం అద్భుతంగాఉండుటవలన అన్నిటా విజయంపొందుతారు. పోటీ పరీక్షలలో అనుకున్న విధంగా మంచిఫలితాలు వస్తాయి. విదేశీ ప్రయత్నాలు మిశ్రమంగా ఫలించును. రైతులకు పంటబాగా పండును. అప్పులు తీర్చగలుగుతారు. పనివారితో ఇబ్బందులు ఉంటాయి. సేంద్రియ యరువుల వాడకంతో మంచి దుగుబడి సాధిస్తారు. పౌల్ట్రీ, పశు, డైరీ వ్యాపారాలు లాభిస్తాయి కానీ వాటివల్ల ఒత్తిడి పెరుగుతుంది.

**స్త్రీలకు** కుటుంబపరిస్థితులు చక్కబడను. ఆశించిన ఉద్యోగవ్యాపార అవకాశాలు చేజిక్కించుకుంటారు. ఆరోగ్యం సహకరిస్తుంది. సంతాన ప్రయత్నాలు ఫలిస్తాయి. గర్భిణీలకు ఆరోగ్యం బాగుండును. నిత్యం దక్షిణామూర్తి స్తోత్ర పఠనం అవసరం.

**పూర్వాభాద్ర నక్షత్రం:** ప్రయాణంలో పెనుప్రమాదం తప్పుతుంది. ఆరోగ్య సమస్యలు వస్తాయి. పనులు సమయానికి చేయగలుగురారు. కుటుంబ వాతావరణం బాగుంటుంది. పాత సమస్యలు అన్ని తీరతాయి. ఉద్యోగ వ్యాపారంలో ఆశించిన లాభాలు పొందుతారు. పెద్దల సహకారం లభిస్తుంది. ఉన్నత పదవులు దక్కుతాయి.

**ఉత్తరాభాద్ర నక్షత్రం:** వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. భౌతిక సుఖాలతో, విలాసవంతమైన జీవితం అనుభవిస్తారు. దాంపత్య జీవితం ఆనందమయంగా ఉంటుంది. కుటుంబ ఖర్చులతో ఇబ్బందులు ఉటాయి. సంతానంతో సమస్యలు, గురువులతో విభేదాలు ఉంటాయి. పనిలో ఒత్తిడి పెరుగుతుంది. ఋణాలు తీసుకుంటారు.

**రేవతీ నక్షత్రం:** ఎంతో శ్రమించి కష్టపడి ధనం సంపాదిస్తారు. కాని కుటుంబం సరిగా గౌరవించదు. పిల్లలు అనేక కోరికలతో ఇబ్బందిపెడతారు. మనస్తాపంవల్ల సుఖపడలేరు. ఖర్చులవల్ల ఋణాలు తీసుకోవలసి వస్తుంది. చిన్న చిన్న విషయాలకు కూడా నొచ్చుకుంటారు. గురువుల దర్శనం, ఆధ్యాత్మిక సాధనవల్ల పరిష్కారం దొరుకుతుంది.

**శాంతి:** శని, రాహుకేతువులకు శాంతి చేయాలి. ఉభయసంధ్యల్లో శివాలయం లో 28 ప్రదక్షిణలు, తదుపరి ఇష్టదైవ ధ్యానం మంచిది. అయప్ప భజనలు, గ్రామదేవాలయాల్లో సేవాకార్యక్రమాలు, అన్నదానం చేస్తే శీఘ్రఫలితాలు.

COPYRIGHTS: **మార్తి. శివరామ యజ్ఞనారాయణ శర్మ సిద్ధాంతి**